

ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలి: డీఆర్వో

కలెక్టరేట్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అర్హులైన ఉపాధ్యాయులు అందరికీ ఓటు హక్కు కల్పించాలని డీఆర్వో అనిత కోరారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నవంబరు 6లోగా ఓటు హక్కు కల్పించేందుకు దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు. నవంబరు 23న ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటిస్తామని, అభ్యంతరాలు స్వీకరణ అనంతరం డిసెంబరు 30న జాబితాను వెల్లడిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డీఈవో ప్రేమకుమార్, ఆర్ఐవో ఆదినారాయణ ,డీవీఈవో భీమశంకర్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు ఏమైంది?



విజయనగరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు

- అదుపు తప్పిన ప్రజారోగ్యం
- డయేరియా విలయతాండవం
- కొరవడిన ముందస్తు చర్యలు
- అన్ని శాఖలదీ వైఫల్యమే
- ప్రభుత్వం సీరియస్

● ఈ ఏడాది ఆగస్టు 2న గంట్యాడ మండలం రామవరం పంచాయతీ కరకవలసలోని ఓ స్వచ్ఛంద సంస్థకు చెందిన హాస్టల్‌లో ఆహారం కలుషితం అయ్యింది. దీంతో 30 మంది చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. ఇద్దరి పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం అందించారు. తిన్న బిర్యానీ కలుషితం కావడం వల్లే డయేరియా ప్రబలిందని వైద్యులు నిర్ధారించారు.

● ఈ నెల 4న పాచిపెంట మండలం విశ్వనాథపురంలో డయేరియా పంజా విసిరింది. ఒకేసారి 32 మంది అస్వస్థతకు గురయ్యారు. ఇద్దరు మృత్యువాతపడ్డారు. దీంతో తీవ్ర భయాందోళన వ్యక్తమైంది. గ్రామంలో పారిశుధ్యం క్షీణించడం, కలుషిత నీరే వ్యాధికి కారణమని వైద్యులు గుర్తించారు.

● పది రోజుల కిందట గుర్ల మండలం పెనుబర్తిలో 20 మంది డయేరియా బారిన పడ్డారు. ఇదే మండలం కోటగండ్రేడులో 30 మంది, గోషాడలో పది మంది ఈ వ్యాధితో అస్వస్థతకు గురయ్యారు. తాజాగా గుర్ల గ్రామంలో ఏకంగా 143 మంది బాధితులు ఉండడం, అందులో ఏడుగురు చనిపోవడంతో సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది.

విజయనగరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో డయేరియా విలయతాండవం చేస్తోంది. ఒక్క గుర్ల మండలంలో నాలుగు రోజుల వ్యవధిలో ఆరుగురు ఈ మహమ్మారికి బలయ్యారు. గత కొద్దిరోజులుగా వ్యాధి ప్రబలుతున్న తీరు చూస్తుంటే కలుషిత జలాలే కారణమని తెలుస్తోంది. ప్రధానంగా చంపావతి నదీ పరివాహక ప్రాంతాల్లోని గ్రామాల్లో ఈ వ్యాధి బారిన పడుతున్నట్టు తెలుస్తోంది. చంపావతి నదిలో నీరు కలుషితం కావడం, భూగర్భ జలాల్లో ఆ నీరు కలవడం, అదే నీటిని ప్రజలు తాగడం వల్లే డయేరియా వ్యాప్తికి కారణమని ప్రచారం జరుగుతోంది. ఈ ఘటనపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. సీఎం చంద్రబాబుతో పాటు మంత్రి లోకేష్ స్పందించారు. ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వ్యాధి నియంత్రణతో పాటు మరణాలు సంభవించకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, జిల్లా యంత్రాంగానికి ఆదేశించారు. దీంతో బాధితులను జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పరామర్శించారు.

ఆస్పత్రులు కిటకిట

జిల్లాలో సీజనల్ వ్యాధులు ముసురుకుంటున్నాయి. జ్వర పీడితులు, డయేరియా, రోగులతో ఆస్పత్రులు నిండిపోతున్నాయి. ఏటా వర్షాకాలం నాటికి వైద్యారోగ్య శాఖ ముందస్తు చర్యలు చేపట్టేది. కానీ ఈ ఏడాది ఆ ప్రణాళిక కొరవడింది. దీనికితోడు గ్రామాల్లో పారిశుధ్య పనులు నిలిచిపోవడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో వ్యాధులు పెరుగుతున్నాయి. మలేరియా శాఖ పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించిన తీరు తేట తెల్లమైంది. ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నా సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. వైద్య ఆరోగ్య శాఖ తూతూమంత్రపు చర్యలకే పరిమితమవుతుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ముందస్తు ప్రణాళిక లేక..

ఉమ్మడి జిల్లాలో విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రితో పాటు పార్వతీపురం ఏరియా ఆస్పత్రి - మిగతా 8వ పేజీలో..



బాబు హామీ నెరవేరుతోంది!

- ●516-బి జాతీయ రహదారి విస్తరణకు అడుగులు
- ●బిడ్ తెరిచిన రోడ్లు, ట్రాన్స్‌పోర్టు హైవే మంత్రిత్వ శాఖ
- ●40.5 కి.మీ. నాలుగు, రెండు వరసలుగా అభివృద్ధి
- ●చింతలపాలెం, వీఆర్‌పేట వద్ద బైపాస్ రోడ్లు
- ●భారతమాల పరియోజన పథకం కింద రూ.956.21కోట్లు



పెందుర్తి నుంచి బొడ్డవర వరకు నాలుగు రోడ్లుగా విస్తరించనున్న విశాఖ-అరకు (516బీ జాతీయ రహదారి) రోడ్డు

2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎస్.కోట ప్రాంతానికి అప్పటి ప్రతిపక్ష నేత చంద్ర బాబు ఎన్నికల ప్రచారానికి వచ్చారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పెందుర్తి నుం చి బొడ్డవర వరకు రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీ నెర వేరుతోంది. కేంద్ర ప్రభుత్వం 40.5 కి.మీ. నాలుగు, రెండు వరసలుగా అభివృద్ధి చేసేందుకు రూ.956.21 కోట్లు కేటాయించింది. టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే పనులు మొదలు పెట్టనున్నారు.

శృంగవరపుకోట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): 516బీ జాతీయ రహదారి అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. కాంట్రాక్టర్ నియామకానికి రోడ్డు, ట్రాన్స్‌పోర్టు, హైవే మంత్రిత్వ శాఖ శుక్రవారం బిడ్‌ను తెరిచింది. ఈ జాతీయ రహదారి కాంట్రాక్టు పొందేందుకు 18 మంది వరకు పేరున్న కంపెనీలు ఇ-ప్రోక్యూర్‌మెంటు ద్వారా టెండర్లు వేశాయి. విశాఖపట్నం జిల్లా పెందుర్తి నుంచి శృంగవరపుకోట మండలం బొడ్డవర వరకు 40.5 కిలోమీటర్లు రోడ్డును అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం భారతమాల పరియోజన పథకం కింద రూ.956.21 కోట్లు కేటాయించింది. రెండు రోజుల క్రితం రాష్ట్రంలోని ఏడు జాతీయ రహదారుల విస్తరణకు విడుదల చేసిన నిధుల్లో పెందుర్తి-బొడ్డవర (516బీ) జాతీయ రహదారి కూడా ఉంది.

ఈ నిధులతో ఏం చేస్తారంటే..

● పెందుర్తి-బొడ్డవర వరకు ఉన్న విశాఖ-అరకు రోడ్డును నాలుగు వరసలుగా నిర్మాణం చేపట్టడంతో పాటు కొత్తవలస, శృంగవరపుకోటలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా బైపాస్ రోడ్డులను నిర్మించనున్నారు. ● చింతలపాలెం నుంచి అప్పన్నపాలెం (జిందాల్ పరిశ్రమకు ముందుకు) వద్ద విశాఖ-అరకు రోడ్డుకు కలిసేలా ఒక బైపాస్.. వెంకటరమణపేట కూడలి నుంచి కిల్తంపాలెం పంచాయతీ శివారు భవానీ నగర్ సమీపంలోని విశాఖ-అరకు రోడ్డును కలిసేలా మరో బైపాస్ నాలుగు వరసలతో నిర్మించనున్నారు. ● బొడ్డవర వరకు నాలుగు వరసలతో అభివృద్ధి చేసిన విశాఖ-అరకు రోడ్డును తాటిపూడి వయా విజయనగరం (516ఇ జాతీయ రహదారి) రోడ్డుకు కలిపేందుకు కిలోమీటరు రోడ్డును - మిగతా 8వ పేజీలో..

ఇందిరమ్మ ఇళ్ల స్థలాలు కబ్జా



అక్రమాలకు అడ్డాగా ఉన్న బొబ్బిలి ఇందిరమ్మకాలనీ

- బొబ్బిలి కాలనీలో 200పైగా నకిలీ పట్టాలు
- అక్రమార్కులతో కుమ్మక్కైన అధికారులు
- గతంలో విచారణ చేపట్టినా బయటపెట్టని నివేదిక
- కూటమి ప్రభుత్వంలోనైనా నిగ్గుతేల్చేనా?

బొబ్బిలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో ఖాళీ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. 2016 నుంచి 2019 వరకు ఈ కాలనీలో 600 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేసినట్లు రెవెన్యూ రికార్డులు చూపుతున్నారు. అయితే అందులో పేదలకు దక్కినవి ఎన్ని అనేది శేష ప్రశ్నగా మిగిలిపోయింది. బినామీ పేర్లతో కొంతమంది వ్యక్తులు రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కుమ్మక్కై వాటిని అక్రమంగా పొంది రియల్ ఎస్టేట్ వ్యాపారాలు సాగించుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో పనిచేసిన తహసీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్వోలు ఇందిరమ్మ ఇళ్ల స్థలాలను బినామీలకు కట్టబెట్టేందుకు అంతులేని అవినీతికి పాల్పడ్డారనే విమర్శలు ఉన్నాయి. ఒకే వ్యక్తికి 30 పట్టాలు ఇచ్చారు. అతడు దర్జాగా ఇళ్ల వ్యాపారం చేసుకుంటున్నా అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై అన్నిరాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాలు అనేకసార్లు ధర్నాలు, ఆందోళనలు, ఫిర్యాదులు చేసినా పట్టించుకునేవారు కరువయ్యారు.

స్థలాలతో వ్యాపారాలు..

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రెండు దశాబ్దాల కిందట బొబ్బిలి పట్టణంలో ఇందిరమ్మ కాలనీని నిర్మించారు. సుమారు 2వేల మందికి పైగా లబ్ధిదారుల కోసం కాలనీ లేఅవుట్ ఏర్పాటు చేశారు. అయితే, పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీలో అవినీతి, అక్రమాలకు పెద్దఎత్తున జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇళ్లు నిర్మించుకోలేని అభాగ్యుల స్థలాలను కొందరు కబ్జా చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారాలు సాగిస్తున్నారు. హెచ్‌టీ విద్యుత్ లైన్ల కింద ఎటువంటి పట్టాలు ఇవ్వరాదన్న నిబంధన ఉంది. ఈ మేరకు కాలనీలో హెచ్‌టీ లైన్ల కింద సుమారు అర కిలోమీటరు పొడవునా ఖాళీ స్థలాలను అప్పట్లో ఉంచారు. ఆ స్థలాలపై కూడా కబ్జాదారుల కన్నుపడింది. వాటిని అమాయకులకు అమ్మేసి సొమ్ము చేసుకుంటున్నారు. కొంత మంది అధికారికంగానే పట్టాలు సృష్టించుకుంటుండగా, మరికొంత మంది నకిలీ పట్టాలను సృష్టించి మాయాజాలం చేస్తున్నారు. లేఅవుట్‌కు ఆవలి భాగంలో ఉన్న ఖాళీ స్థలాల్లో రెవెన్యూ ఉద్యోగుల సహకారంతో యథేచ్ఛగా వ్యాపారాలు సాగిపోతున్నాయి.

నివేదిక ఏమైంది?

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇందిరమ్మ కాలనీలో జరిగిన అక్రమాలపై విచారణకు ఆదేశించింది. ఈ మేరకు రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సమష్టిగా విచారణ జరిపి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించారు. అయితే, ఏమైందో గానీ అంతా గప్‌చుప్ అయ్యారు. దీంతో దర్యాప్తు నివేదిక బయటపడలేదు. ఫలితంగా అక్రమాలకు పాల్పడిన వారిపై ఎటువంటి చర్యలు లేవు. దీనిపై వామపక్ష సంఘాల నాయకులు పలు దఫాలు ధర్నాలు, ఆందోళనలు చేసినా ఫలితం లేకుండా పోయింది. వైసీపీకి చెందిన మున్సిపల్ వైస్‌చైర్మన్ చెలికాని మురళీకృష్ణ, టీడీపీ కౌన్సిలర్ రాంబార్కి శరత్‌బాబు తదితరులు పలుమార్లు కౌన్సిల్ సమావేశాల్లో అధికారులను గట్టిగా నిలదీశారు. అయినా చర్యలు మాత్రం శూన్యం. ఈ కాలనీలో సుమారు 200కి పైగా నకిలీ ఇళ్ల పట్టాలను సృష్టించినట్లు తెలుస్తోంది. ఇక్కడ 450 ఖాళీ స్థలాలు ఉండాలి. కానీ 250 వరకు మాత్రమే ఉన్నట్లు తెలుస్తోంది. మిగతావి ఎవరికి ఇచ్చారో తేలాల్సి ఉంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ ఇందిరమ్మకాలనీ భాగోతం తెరపైకి వచ్చింది. కబ్జా అయిన స్థలాలను స్వాధీనం చేసుకొని నిరుపేదలకు పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

నకిలీ పట్టాలపై చర్యలు తీసుకోవాలి..

బొబ్బిలి ఇందిరమ్మ కాలనీలోని నకిలీ పట్టాలపై చర్యలు తీసుకో వాలి. ఈ కాలనీకి సంబంధించిన రికార్డులను మాయం చేశారన్న ఆరోపణలపై దర్యాప్తు చేసి నిందితులపై చర్యలు తీసుకోవాలి. గతంలో అధికారులు చేపట్టిన విచారణ నివేదికను బయటపెట్టాలి. అక్రమ కట్టడాలను పూర్తిగా తొలగించాలి. ఖాళీ స్థలాలను నిజమైన పేదలకు పంపిణీ చేయాలి. వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్రమార్కులు రెచ్చిపోయారు. ఇక్కడ ఇళ్ల స్థలాలను కబ్జాచేసి వ్యాపారాలు సాగించారు.

-కాగాన సునీల్‌కుమార్,
జిల్లా ఎంఆర్‌పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, బొబ్బిలి

విచారణ చేపడతాం..

ఇందిరమ్మ కాలనీలో నకిలీ పట్టాలు ఇచ్చినట్లు వచ్చిన ఆరోపణలపై రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో సంయుక్తంగా విచారణ చేపడతాం. అక్రమాలు జరిగినట్లు తేలితే తగిన చర్యలు తీసుకుంటాం. ఎమ్మెల్యే బేబీనాయన కూడా చర్యలు తీసుకోవాలని మమ్మల్ని కోరారు. కాలనీలో 450 ఖాళీస్థలాలు ఉండాలి. సగానికి పైగా దొంగపట్టాలను సృష్టించినట్లు ఆరోపణలు ఉన్నాయి. వాటన్నిటినీ నిగ్గుతేల్చుస్తాం.

-మల్లపురెడ్డి శ్రీను, తహసీల్దార్, బొబ్బిలి

మహిళల్లో అక్షరాస్యత పెంపే లక్ష్యం

● కలెక్టర్ అంబేడ్కర్ ● 5 నుంచి 'ఉల్లాస్' ప్రారంభం



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 48,578 మంది నిరాక్షరాస్య మహిళలను అక్షరాస్యులుగా తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. శుక్రవారం తన చాంబర్‌లో వివిధ మాట్లాడుతూ.. మహిళల అక్షరాస్యతను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం రూ పొందించిన ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) కార్యక్రమాన్ని నవంబరు 5న జిల్లాలోని ప్రారంభించాలన్నారు. దీనికి సంబంధించి ఈనెల 24లోగా సర్వే పూర్తి చేసి మహిళల జాబితాను సిద్ధం చేయాలన్నారు. 29న కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి, నవంబరు 2న మండల స్థాయి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. సుమారు 4,800 వీటీ(వలంటీర్ టీచర్)ల ద్వారా మహిళలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.

మద్యం దుకాణం ముందు హైడ్రామా!

● బొబ్బిలి బజారు రోడ్డులో షాపు వద్దని మహిళల ఆందోళన
● ఆత్మహత్య చేసుకుంటానని షాపు యజమాని భార్య హెచ్చరిక



ఆందోళన చేస్తున్న మహిళలతో మాట్లాడుతున్న ఎక్సైజ్ అధికారులు

బొబ్బిలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ఆరో వార్డు మేదరబంద జంక్షన్ బజారు రోడ్డులో కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం షాపు ముందు శుక్రవారం హైడ్రామా చోటుచేసు కుంది. ఈ ప్రాంతంలో మద్యం షాపును ఏర్పాటు చేయవద్దని సీపీఎం, ఐద్వా నాయకుల ఆధ్వర్యంలో స్థానిక మహిళలు ఆందోళన చేశారు. షాపు ముందు బైఠాయించి యజమానితో వాగ్వాదానికి దిగారు. ఎక్సైజ్ సీఐ పామోటి చిన్నంనాయుడు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకుని మహిళలకు నచ్చజెప్పినా వారు శాంతించలేదు. షాపును పూర్తిగా మూసి వేస్తే గాని ఇక్కడ నుంచి కదిలేది లేదని భీష్మించారు. ఇంతలో షాపు యజమాని టి.రామాంజనేయ గుప్త సతీమణి అక్కడకు వచ్చారు. ఎంతో గౌరవమర్యాదలతో బతుకుతున్నామని, ఆడ పిల్లలు ఉన్నారని, సంప్రదాయంగా జీవనం సాగిస్తున్నామని, మద్యం వ్యాపారం కోసం షాపును అద్దెకు ఇవ్వడం పరువు తక్కువని ఆవేదన చెందుతూ ఆత్మహత్య చేసుకుంటానని రోదించారు. దీంతో ఆమె భర్త స్పందించి వెంటనే ఓ లేఖను ఎక్సైజ్ అధికారులకు అందజేశారు. తాము షాపును మద్యం వ్యాపారుల నుంచి వాపసు తీసుకుంటామని, అద్దెకు ఇవ్వబోమని స్పష్టం చేశారు. దీంతో మహిళలు ఆందోళన విరమించారు.

గడువు ఇవ్వాలి..

షాపును ఇప్పటికిప్పుడు మార్చాలంటే కుదరదని ఎక్సైజ్ అధికారులు అన్నారు. మద్యం వ్యాపారులకు కొంతగడువు ఇవ్వాలని మెలిక పెట్టారు. ఈ నెల 25 వరకు ప్రస్తుత షాపులోనే మద్యం వ్యాపారం చేసుకునేందుకు అవకాశం కల్పించారు. దీంతో శుక్రవారం సాయంత్రం మద్యం అమ్మకాలు యథాతథంగా జరిగాయి.

వైన్‌షాపు వద్దు

● అధికారులకు దేవుదళ గ్రామస్థుల ఫిర్యాదు

రేగిడి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దేవుదళ రోడ్డులోని షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడంపై దేవుదళ, పరిసర గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. షాపును ఏర్పాటు చేయవద్దంటూ శుక్రవారం స్థానిక టీడీపీ నేత కెంబూరు కోటేశ్వరరావు, పుర్లి సర్పంచ్ ఎర్నేన రామినాయుడు తదితరులు దేవుదళ సచివాలయ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ రోడ్డులో వైన్ షాపు ఉంటే ప్రజల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతుందని, రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని, శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందని వివరించారు. ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటుకు అనుమతి ఇవ్వొద్దని కోరారు.



దేవుదళ సచివాలయంలో ఫిర్యాదు చేస్తున్న గ్రామస్థులు

మనసుదోచే మన్యం అందాలెన్నో..

- పర్యాటకానికి కేరాఫ్ సీతంపేట ఏజెన్సీ
- ప్రకృతి రమణీయ దృశ్యాలకు నిలయం
- కూటమి ప్రభుత్వ చొరవతో అభివృద్ధికి బాటలు



సీతంపేట మన్యంలో ఆడలి వ్యూ పాయింట్

సీతంపేట రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రకృతి రమణీయ దృశ్యాలు.. ఆహ్లాదకర ప్రదేశాలకు కేరాఫ్‌గా నిలుస్తోంది సీతంపేట మన్యం. ఇక్కడ పర్యాటకుల మనసుదోచుకునే సందర్శక ప్రాంతాలెన్నో ఉన్నాయి. అందుకే ఏటా సీతంపేట ఏజెన్సీకి వచ్చే సందర్శకుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. తాజాగా కూటమి ప్రభుత్వం కూడా ఈ ప్రాంతంపై దృష్టి సారించింది. పర్యాటక అభివృద్ధికి చర్యలు చేపడుతోంది. దీంతో స్థానిక గిరిజన యువత కూడా ఉపాధి పొందుతున్నారు. రానున్న రోజుల్లో రూ.కోటిన్నరతో మరిన్ని సాహసోపేత మైన క్రీడలు, పారా మోటారింగ్‌ను అందుబాటు లో తీసుకురానున్నారు. పర్యాటకులు రాత్రిబస చేసేందుకు వీలుగా తురాయిపువలస ఉద్యానవన కేంద్రంలో కాటేజీలు ఏర్పాటుకు ప్రణాళికలు రూపొంది స్తున్నారు. ఇప్పటికే శని, ఆదివారాల్లో ఆయా ప్రాంతాలు సందర్శకు లతో కిటకిటలాడు తుండగా.. పూర్తి స్థాయిలో వసతులు కల్పిస్తే.. వారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

చూడాల్సిన ప్రదేశాలు...

సీతంపేట ఏజెన్సీలో చూడాల్సిన ప్రదేశాల్లో ముఖ్యమైనది ఆడలి వ్యూ పాయింట్. దీంతో పాటు మెట్టుగూడ జలపాతం, సీతంపేటలోని ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్ వంటివి చూడొచ్చు. పార్క్‌లో ఆల్ టెర్రయిన్ వెహికిల్, బుల్ రైడ్, గైరో వంటి క్రీడలతో పాటు 5డీ థియేటర్ ను సైతం పునఃప్రారంభించారు. అంతే కాకుండా పర్యాటకుల ఫొటో షూట్ కోసం ఏర్పాట్లు చేశారు.





ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌లో పర్యాటకుల కోసం పునఃప్రారంభించిన 5డీ థియేటర్

ఆడలి వ్యూ పాయింట్‌లో ఇలా..

సీతంపేట ఏజెన్సీకే తలమానికంగా పేరొందిన ఆడలి వ్యూ పాయింట్‌లో పర్యాటకులకు సౌకర్యాలు కల్పించేందుకు ఐటీడీఏ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడ రాత్రి బస చేసేందుకు వీలుగా తొమ్మిది టెంట్ హౌస్‌లను ఏర్పాటు చేశారు. సాయంత్రం 5 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు పర్యాటకులు అందులో ఉండేందుకు అనుమతి ఇస్తారు. వీరికి సాయంత్రం స్నాక్స్‌తో పాటు రాత్రికి అన్‌లిమిటెడ్ ఫుడ్‌తో డిన్నర్ ఏర్పాటు చేస్తారు. అంతే కాకుండా శని, ఆదివారాల్లో గిరిజన సంప్రదాయ నృత్యాలతో ఎంటర్‌టైన్‌మెంట్ ప్రోగ్రాంలు, ఫైర్ క్యాంప్‌లు కూడా నిర్వహించనున్నారు. ఆసక్తి ఉన్న పర్యాటకులు ట్రెక్కింగ్ చేసేందుకు అవకాశం కల్పించనున్నారు. వీరికి టీ, బిస్కెట్స్‌తో పాటు రెండు మినరల్ వాటర్ బాటిల్స్ ఇవ్వనున్నారు. రానున్న రోజుల్లో పక్కా కాటేజీల ఏర్పాటుకు ఐటీడీఏ అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే సీతంపేట ఏజెన్సీ అందాలకు గుర్తింపు లభించింది. 2016-17 ఏడాదిలో మెట్టుగూడ జలపాతం, సీతంపేటలోని ఎన్టీఆర్ అడ్వంచర్ పార్కు, ఇతర పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి బీజం పడింది. పార్క్‌లో పర్యాటకులకు వినోదాన్ని ఇచ్చే సాహసోపేతమైన క్రీడలను ఏర్పాటు చేశారు. వీటి మూలంగా సీతంపేట ఐటీడీఏకు పేరుతో పాటు ఆదాయం చేకూరింది. అప్పట్లోనే సున్నపుగెడ్డ జలపాతం, జగతిపల్లి రిసార్ట్స్‌ను అభివృద్ధి చేసేందుకు నిధులు కూడా మంజూరు చేశారు. జగతిపల్లి రిసార్ట్స్ గిరి శిఖర ప్రాంతంలో ఉండడంతో నిర్మాణ పనులు వేగవంతం కాలేదు. అటవీశాఖ నుంచి అనుమతులు రాని కారణంగా సున్నపుగెడ్డ జలపాతం అభివృద్ధి పనులు సగంలో నిలిచిపోయాయి. బెన్నరాయి, పొల్ల వ్యూ పాయింట్ అందాలను తీర్చిదిద్దేందుకు కూడా సాంకేతిక పరమైన సమస్యలు తలెత్తాయి. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పరిస్థితి మారింది. సీతంపేట ఏజెన్సీలో పర్యాటక అభివృద్ధికి అటకెక్కింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం సీతంపేట ఏజెన్సీ ప్రాంతంలోని ప్రకృతి అందాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అదే రోజున ఆడలి వ్యూ పాయింట్ అందాలను పర్యాటకులకు అంకితం చేశారు.


వ్యూ పాయింట్‌లో రాత్రి బస కోసం ఏర్పాటు చేసిన టెంట్ హౌస్

విస్మరించిన వైసీపీ ప్రభుత్వం..

గత వైసీపీ ప్రభుత్వం.. సీతంపేట పర్యాటక ప్రాంతాలపై నిర్లక్ష్యంగా వ్యవహరించింది. పర్యాటక అభివృద్ధిని విస్మరించింది. కొత్తగా గుర్తించిన పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయకపోగా ఉన్న వాటిని పట్టించుకోలేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రస్థాయిలో పేరొందిన ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌లోని సాహస క్రీడల పరికరాలు మూలకు చేరాయి. దీంతో సీతంపేటకు వచ్చే పర్యాటకుల సంఖ్య తగ్గింది.

పేరులో నేముంది!

- అసలు పేర్ల కన్నా ముద్దు పేర్లే మిన్న
- రాజకీయ ప్రముఖులకు అదే అలంకారం


అశోక్‌గజపతిరాజు


బేబీనాయన


సుజయ్‌కృష్ణ రంగారావు


బొత్స


చిన్నశ్రీను


బెల్లాన


కోలగట్ల

రాజాం రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పేరులో 'నేము'ంది.. అవును.. పేరులోనే అంతా ఉంది. పేరులో ఏముందిలే అని కొందరు నిట్టూరుస్తూ ఉండొచ్చు. అది మనిషైనా... ప్రాంతమైనా పేరుది ప్రత్యేక స్థానమే. కొంతమందికి అసలు పేరుతో పిలిస్తేనే అందరికీ తెలుస్తుంది. మరికొంత మందికి అసలు పేరు కన్నా ముద్దు పేరుకే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది.. ఇంకొంత మందికి ఇంటిపేరు ఉంటేనే వారెవరో అందరికీ తెలిసేది. సినీ తారల నుంచి రాజకీయ నాయకుల వరకూ ముద్దు పేర్లతో వాసికెక్కినది ఎందరో. చిరంజీవిని చిరుగా.. నందమూరి బాలకృష్ణను బాలయ్యగా.. ప్రభాస్‌ను డార్లింగ్‌గా అభిమానులు పిలుచుకుంటారు. విజయనగరం జిల్లాలోని కొంతమంది రాజకీయ నేతలకూ ముద్దు పేర్లు ఉన్నాయి.

● ముద్దుపేర్ల ముచ్చట..

జిల్లా నేతలలో అనేక మంది ముద్దుపేర్లతోనే గుర్తింపు పొందారు. మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజును దేశవ్యాప్తంగా అశోక్‌గా అంతా సంబోధిస్తారు. పూర్తిపేరుతో పిలిచేవారు లేరంటే అతిశయోక్తి కాదు. ఇదే కోవలో బొబ్బిలి రాజులు రావు వెంకట శ్వేత కుమార సుజయకృష్ణ రంగారావు అంటే తెలిసేది వేళ్లపైనే. బేబీనాయనగా ఆయన వేలాదిమంది హృదయాల్లో చోటు సంపాదించుకున్నారు. ఆయన సోదరుడు సుజయ్‌కృష్ణ రంగారావు సుజయ్, సుజయ్ నాయనగా అందరికీ సుపరిచితం. రాష్ట్ర మాజీ మంత్రి బొత్స సత్యనారాయణదీ అదే పరిస్థితి. చిన్ననాటి నుంచి సత్తిబాబుగానే ఆయన గుర్తింపు పొందారు. ఇదే కోవలో జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు. చిన్న శ్రీనుగా ఆయన ఉత్తరాంధ్రలో ప్రముఖంగా సుపరిచితులు. ఆయన అసలుపేరు ఏ కొద్దిమందికో తెలిసే పరిస్థితి. విజయనగరం మాజీ ఎం.పి. బెల్లాన చంద్రశేఖర్‌కు పెదబాబుగా పిలుస్తుంటారు. లోక్‌సభ వంటి అధికారిక సమావేశాలను మినహాయిస్తే పెదబాబు అంటేనే ఆయనకు మక్కువ. విజయనగరం మాజీ ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామిని అంతా స్వామి అని ముద్దుగా పిలుస్తారు.

● ఇంటి పేరు ఉంటేనే...

ఇంటి పేరుతో జనంలో గుర్తింపు పొందిన వారు అనేకమంది. వీరి పేరు పక్కన ఇంటి పేరు లేకపోతే గుర్తించడానికి కాస్త సమయం తీసుకోవాల్సి వస్తుంది. తెలుగుదేశం పార్టీ చీపురుపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జున, ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, టీడీపీ నేత గద్దే బాబూరావు తదితర నేతలంతా 'ఇంటి పేరు' కోవలోకి వస్తారు. ఇక పల్లెలు...పట్టణాల్లోనూ ఇలాంటి ముద్దు పేర్లతో ప్రసిద్ధి చెందిన ఎంతోమంది ఉన్నారు.

క్రీడల్లో మెరిసి.. జాతీయ స్థాయికి ఎగసి!

- సౌకర్యాలు లేకపోయినా పట్టుదలతో సాధన
- జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన మౌనిక

రామభద్రపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలో పుట్టి.. ఎటువంటి సౌకర్యాలు లేనప్పటికీ క్రీడల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన పేదింటి బాలిక ఎందరికో ఆదర్శంగా నిలుస్తోంది. ఆమె పేరు రొంగళి మౌనిక. విజయనగరం జిల్లా రామభద్రపురం మండలం కొట్టక్కి. ఎరుకుల పాకలకు చెందిన రొంగళి తిరుపతిరావు, లక్ష్మిల సంతానం మౌనిక. తండ్రి తిరుపతిరావు ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తుండగా తల్లి లక్ష్మి గృహిణి. సామాజికంగా, ఆర్థికంగా ఆ కుటుంబానికి ఇబ్బందులు ఉన్నప్పటికీ తమ కుమార్తెను క్రీడల్లో ప్రోత్సహించడం విశేషం. తల్లిదండ్రులు ఇద్దరూ పెద్దగా చదువుకోలేదు. అయినప్పటికీ తమ బిడ్డను మంచి క్రీడాకారిణిగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో పోటీలు జరిగే ప్రాంతాలకు స్వయంగా తీసుకువెళుతుంటారు.


తాను సాధించిన పతకాలతో రొంగళి మౌనిక

సాధన కోసం పది కిలోమీటర్లు వెళ్లి...

ప్రస్తుతం మౌనిక కొట్టక్కి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. తాను చదువుతున్న పాఠశాలలో సరైన క్రీడా మైదానం... సౌకర్యాలు లేకపోయినప్పటికీ తమ ఊరికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న బొబ్బిలి మండలం పారాది హైస్కూల్ గ్రౌండ్‌కు వెళ్లి సాధన చేస్తోంది. చిన్నప్పటి నుంచి క్రీడలపై ఆ విద్యార్థినికి ఉన్న మక్కువను కొట్టక్కి పాఠశాల పీఈటీ రత్నకిశోర్ గుర్తించి... ప్రోత్సహించారు. తగినన్ని సౌకర్యాలు లేకపోయినప్పటికీ ఆటలపై ఉన్న శ్రద్ధ, పట్టుదల తనను ఈ స్థాయికి తెచ్చాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రావాడ భాస్కరరావు తెలిపారు.

విజయాలు ఇలా...

ఇటీవల ఏలూరు జిల్లా పెదవేగిలో జరిగిన సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి అండర్-19 విభాగంలో విజయనగరం జిల్లా తరఫున మౌనిక పాల్గొని మంచి ప్రతిభ కనబరచడంతో పాటు జట్టు విజయంలో కీలక భూమిక వహించింది. దీంతో నవంబరు నెలలో మహారాష్ట్రలో జరగనున్న జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ తరఫున మౌనిక మాత్రమే ఎంపికైంది. 2023లో జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జూనియర్ విభాగంలో పాల్గొని విజయనగరం జిల్లాను ప్రథమ స్థానంలో నిలపడంలో మౌనిక పాత్ర మరచిపోలేనిది. గతంలో రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో పాల్గొని కాంస్య పతకం సాధించింది. వీటితో పాటు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ క్రీడల్లో కూడా ఈ బాలిక ముందంజలోనే ఉంది.

సాంస్కృతిక ప్రదర్శనల్లో...

క్రీడలే కాకుండా సాంస్కృతిక ప్రదర్శనల్లోనూ మౌనిక ప్రతిభ చూపుతోంది. నృత్య ప్రదర్శనలోనూ రాణిస్తోంది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ తమ కుమార్తె క్రీడల్లో చూపుతున్న మక్కువతో ఆమెకు ప్రోత్సాహం అందిస్తున్నామని తల్లిదండ్రులు తెలిపారు. ఆర్థికంగా ప్రోత్సాహం అందితే మున్ముందు తమ బిడ్డ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు అవకాశం ఉంటుందని అంటున్నారు.

ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం..

క్రీడల్లో మంచి ప్రావీణ్యం సంపాదిస్తున్న మౌనికపై శ్రద్ధ తీసుకోవడమే కాకుండా... ప్రత్యేక శిక్షణకు ఎక్కువ సమయం కేటాయిస్తున్నాం. వేసవి శిబిరాల్లో మెలకువలు నేర్పడంపై దృష్టి సారిస్తున్నాం. బాలికకు అవసరమైన కిట్లు కూడా అందిస్తున్నాం.

-రత్నకిశోర్, వ్యాయామ ఉపాధ్యాయుడు, కొట్టక్కి పాఠశాల

పోలీసు అధికారిని కావాలన్నదే లక్ష్యం

క్రీడల్లో మంచి స్థానం సంపాదించి..భవిష్యత్తులో పోలీసు ఆఫీసర్ కావాలన్నదే నా లక్ష్యం. మా పాఠశాలలో క్రీడా మైదానం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం గ్రామీణ ప్రాంత విద్యార్థులపై దృష్టి సారించి మంచి అవకాశాలు కల్పిస్తే... ఎంతోమంది క్రీడాకారులు తమ ప్రతిభ చూపే అవకాశం ఉంటుంది.

-రొంగళి మౌనిక, క్రీడాకారిణి, కొట్టక్కి పాఠశాల

ఉమాదేవి కరుణ కోసం!

- నేడు అట్ల తద్దె
- వ్రతానికి మహిళలు సిద్ధం

బొబ్బిలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల పండగల్లో అట్ల తద్దెకు ఓ ప్రత్యేకత ఉంది. ఉమాదేవి (గౌరీ దేవి) వ్రతాన్ని ఆచరించడమే అట్ల తద్దెగా ప్రాచుర్యం చెందింది. శనివారం జిల్లాలోని మహిళలంతా ఈ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొనేందుకు సిద్ధమవుతున్నారు. సాయంత్రం చంద్రుని దర్శనమయ్యాక మహిళలు ఉమాదేవిని ఆరాధించి తొమ్మిది అట్లను నైవేద్యంగా పెడతారు. తొమ్మిది అట్లను పేరంటాళ్లకు వాయనంగా అందజేసి... తొమ్మిది పూల ముడితో తోరం కడతారు. ఇంట్లో, పెరట్లో ఊయల కడతారు. 'అట్ల తద్దోయ్... ఆరట్లోయ్... ముద్దపప్పు మూడట్లోయ్' అని పాడుకుంటూ ఇరుగు పొరుగు వారు, స్నేహితులతో కలిసి ఉల్లాసంగా గడుపుతారు. తల్లులంతా బాల్యదశలోకి ఓసారి తొంగి చూసుకొని నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటారు. పిల్లలు కేరింతలు కొడతారు. పెళ్లికాని వారికి మంచి భర్త దొరుకుతాడని... పెళ్లయిన వారు భర్తాపిల్లలతో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉంటారన్నది మహిళల నమ్మకం.


అట్లతద్దెలో విందు ఆరగిస్తున్న మహిళలు (ఫైల్)

అమ్మవారికి ఇష్టమైన వ్రతం..

నారదముని ప్రోత్సాహంతో శివుడిని పతిగా పొందేందుకు గౌరీ దేవి తొలిసారిగా చేసిన వ్రతమే అట్లతద్దె. ఇది చంద్ర ఆరాధన. అమ్మవారికి అట్లను నైవేద్యం పెట్టే ఈ వ్రతంతో స్త్రీలకు సౌభాగ్యం కలుగుతుందని నమ్మకం. రుతుక్రమం సక్రమంగా జరిగి, గర్భధారణలో ఎటువంటి సమస్యలు ఉత్పన్నమవ్వబోవని వారి ప్రగాఢ విశ్వాసం. ముత్తయిదువులకు లక్కకోళ్లు, రవికెలు, దక్షిణ తాంబూలాలు, అట్లు వాయనమిచ్చి.. భోజనం పెట్టి వారి ఆశీర్వాదం అందుకుంటారు. అమ్మవారికి ఇష్టమైన వ్రతం ఇదని మహిళల విశ్వాసం.

డోలపేట పాఠశాలలో ఆకలికేకలు

రాజాం రూరల్, అక్టోబరు 18: రాజాం మున్సిపాలిటీ పరిధిలోని డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కొంతమంది విద్యార్థులకు భోజనం అందలేదు. పాఠశాలకు హాజరైన విద్యార్థులకు సరిపడినంతగా ఆహార పదార్థాలు వండకపోవడమే ఇందుకు కారణంగా తెలిసింది. 550 మంది విద్యార్థులకు గాను శుక్రవారం 450 మంది హాజరయ్యారు. హెచ్.ఎం. మురళీకృష్ణ సుమారు 400 మందికి సరిపడా మాత్రమే వంట దినుసులు ఇవ్వడంతో ఈ పరిస్థితి తలెత్తింది. విద్యార్థుల పరిస్థితిని తెలుసుకున్న విద్యాకమిటీ ఛైర్మన్ శ్రీనివాసరావు పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. పరిస్థితిని హెచ్.ఎం.కు వివరించినా ఆయన పట్టించుకోలేదని శ్రీనివాసరావు తెలిపారు. ఎట్టకేలకు మధ్యాహ్నం రెండున్నర గంటల తరువాత తిరిగి వండించినట్లు శ్రీనివాసరావు వివరించారు.


భోజనాల కోసం ఖాళీ ప్లేట్లతో ఎదురుచూస్తున్న విద్యార్థినులు

రాష్ట్రాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దుతాం

దత్తిరాజేరు/భామిని/ గుర్ల/నెల్లిమర్ల/జామి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దాలనే కృతనిశ్చయంతో కూటమి ప్రభుత్వం ఉందని టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలు, నేతలు చెప్పారు. పల్లెపండుగ కార్యక్రమాల్లో భాగంగా దత్తిరాజేరు, భామిని, గుర్ల, నెల్లిమర్ల, జామి మండలాల్లోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యేలు శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు పెద్ద పీట వేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే పంచాయతీలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించామని తెలిపారు. రోడ్లు, కాలువల నిర్మాణానికి ప్రాధాన్యమిస్తున్నట్టు చెప్పారు. ప్రజలు తమ సమస్యలు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకొని వచ్చి పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. గ్రామాల్లో సమస్యలపై స్థానికుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఇదిలా ఉండగా మరికొన్ని గ్రామాల్లో కూటమి మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పల్లెపండుగ కార్యక్రమాల్లో భాగంగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



దత్తిరాజేరు: పాపయ్యవలసలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కొండపల్లి



భామిని: చిన్నదిమిలిలో రహదారి నిర్మాణానికి పూజ చేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ



నెల్లిమర్ల: శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి



గుర్ల: సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు

టీడీపీ సమావేశంలో ఎంపీ

రాజాం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి తెలుగుదేశం కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన నిర్వహించిన తెలుగుదేశం ప్రజాప్రతినిధుల సమావేశంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, రాజాం, బొబ్బిలి ఎమ్మెల్యేలు కోండ్రు మురళీమోహన్, బేబినాయన తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌కు కృతజ్ఞతలు

విశాఖపట్నానికి టీసీఎస్ కంపెనీని తీసుకు వచ్చి 10వేల ఉద్యోగాలు కల్పించబోతున్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌కు టీడీపీ యువనేత కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు శుక్రవారం విశాఖ విమానాశ్రయంలో లోకేష్‌కు ఘన స్వాగతం పలికారు.

న్యాయసేవలను వినియోగించుకోండి

రామభద్రపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అవసరమైన వారు ఉచిత న్యాయ సహాయాన్ని పొందాలని నాయుడువలస ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం జేసీరాజు తెలిపారు. శుక్రవారం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఉచిత న్యాయ సహాయానికి 15100 ఫోన్‌నెంబర్‌ను సంప్రదించాలన్నారు. .

ఇంకుడు గుంతలు మంజూరు

లక్కవరపుకోట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రతి మండలానికి ఒక్కో వెయ్యి ఫారం పాండ్స్, ఒక్కో వెయ్యి ఇంకుడు గుంతలు చొప్పున రెండు వేల గుంతలు మంజూరయ్యాయని ఏపీడీ శారదాదేవి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

కరపత్రాల ఆవిష్కరణ

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభల కర పత్రాలను డీఈఓ ప్రేమ్‌కుమార్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు నాగభూషణం, ఫణీంద్ర మాట్లాడుతూ రాష్ట్ర మహాసభల విజయవంతానికి సహకరించాలని డీఈవోను కోరామన్నారు.

కోచ్ క్యాంప్‌నకు ఎంపిక

శృంగవరపుకోట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోటకు చెందిన గుంట్రోతు శ్రీనివాసరావు భారత కోచ్ క్యాంప్‌నకు కోచ్‌గా ఎంపికయ్యారు. భారత బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాయపూర్‌లో ఈ నెల 21 నుంచి 29 వరకు కోచ్ క్యాంప్ నిర్వహించనుంది.

క్షేత్ర సహాయకుడిని నియమించండి

శృంగవరపుకోట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దారపర్తి గిరిజన పంచాయితీకి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడిని నియమించాలని జనసేన నాయకుడు ఒబ్బిన సన్యాసినాయుడు ఆధ్వర్యంలో గిరిజనులు ఈ ఎంపీడీఓ సతీష్‌కు వినతిపత్రం అందించారు. పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని ఎన్నికల ఉప తహసీల్దార్ సునీతను కోరారు.

సాంస్కృతిక పరిశోధన శిక్షణకు దామోదరరావు

సంతకవిటి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలోని కేంద్ర సాంస్కృతిక పరిశోధన శిక్షణ సంస్థ నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో బొద్దూరు ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు అదపాక దామోదరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ ఏకపాత్రాభినయంతో ఆకట్టుకున్నారు.

పీటీసీ ప్రిన్సిపాల్‌గా రామచంద్రరాజు

విజయనగరం క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పోలీసు శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్‌గా రామచంద్రరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పల్నాడు జిల్లా ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్న రామచంద్రరాజుకు ఎస్పీగా పదోన్నతి లభించడంతో ఆయనను రాష్ట్ర ప్రభుత్వం పీటీసీ ప్రిన్సిపాల్‌గా నియమించింది.

ఓపెన్‌స్కూల్ గడువు పెంపు

కొత్తవలస, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఓపెన్ స్కూల్ ద్వారా పది, ఇంటర్‌లో ప్రవేశానికి ఈ నెల 25వ తేదీ వరకు గడువు పెంచినట్టు ఎంఈవో బి.శ్రీనివాసరావు తెలిపారు. రూ.200 అపరాధ రుసుంతో 29 వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. రూ.500 అపరాధ రుసుంతో 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.

పారిశుధ్య వారోత్సవాలు

విజయనగరం టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 777 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం నుంచి ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలు నిర్వహించనున్నట్టు జిల్లా పంచాయతీ అధికారి టి.వెంకటేశ్వరరావు తెలిపారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా పారిశుద్ధ నిర్వహణ పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. పంచాయతీ అధికారులు ఈ పనులను పర్యవేక్షించాలని ఆదేశించినట్టు చెప్పారు. కలుషిత తాగునీరు, పారిశుధ్య లోపం ఉంటే అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

టీడీపీ సమావేశంలో మహిళా ప్రజాప్రతినిధులు



సమావేశానికి హాజరైన మహిళా ప్రజాప్రతినిధులు

విజయనగరం/ఎస్.కోట/పార్వతీపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంగళగిరిలో శుక్రవారం నిర్వహించిన టీడీపీ ప్రజా ప్రతినిధుల సమావేశానికి ఉమ్మడి జిల్లాకు చెందిన మహిళా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ, గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఎస్.కోట, విజయనగరం, కురుపాం శాసనసభ్యులు కోళ్ల లలితకుమారి, పూసపాటి అదితి గజపతిరాజు, తోయక జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో భాగంగా హోం మంత్రి అనితను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కలుసుకున్నారు.

అన్న క్యాంటీన్‌లో గలాటా



అన్న క్యాంటీన్ నిర్వాహకుడితో స్థానికుల వాగ్వాదం

రాజాం రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజాంలోని అన్న క్యాంటీన్ నిర్వహణపై విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల వరకూ ఆహార పదార్థాలు రాకపోవడంతో ఆహారం కోసం జనం క్యాంటీన్ వద్ద బారులు తీరారు. ఓవైపు ఎండ.. మరోవైపు ఆకలి నేపథ్యంలో రెండు గంటల తరువాత ఆహార పదార్థాల పంపిణీ సమయంలో గలాటా చోటుచేసుకుంది. పప్పులో నాణ్యత లేదని... వేడినీరు కలిపిన విధంగా ఉందన్న ఆరోపణలు వినిపించాయి. ఇదే విషయాన్ని నిర్వాహకుడిని పలువురు ప్రశ్నించారు. ఆయన నుంచి సరైన సమాధానం రాకపోవడంతో పెట్టింది తిని... ఇంటిబాట పట్టారు. ఇదే విషయాన్ని క్యాంటీన్ నిర్వాహకుడు రామారావు వద్ద శుక్రవారం రాత్రి ప్రస్తావించగా... ఆహార పదార్థాలు రావడంలో ఆలస్యమైందన్నారు. ఎలా వచ్చినవి అలా పంపిణీ చేశామని చెప్పుకొచ్చారు.

ముగిసిన వాలీబాల్ ఎంపిక పోటీలు



వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న బాలికలు

విజయనగరం టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రాజీవ్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్ అండర్-14, 17 బాల బాలికల వాలీబాల్ ఎంపిక పోటీలు శుక్రవారం ముగిశాయి. స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి కె.కృష్ణంరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 120 మంది బాలురు, 60 మంది బాలికలు హాజరయ్యారు. ఈ పోటీలను డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేసినట్టు జిల్లా కార్యదర్శి కె.కృష్ణంరాజు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 21 నుంచి 23 వరకు అనంతపురం జిల్లా హిందూపురంలో నిర్వహించే అంతర్ జిల్లాల వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

ప్రేరణ శిక్షణ తరగతులకు కంచరాం విద్యార్థిని

రాజాం రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20 నుంచి 26 వరకూ అహ్మదాబాద్‌లో నిర్వహించనున్న జాతీయ ప్రేరణ శిక్షణ తరగతులకు కంచరాం జెడ్పీ ఉన్నత పాఠశాలకు విద్యార్థిని పెనుబోతుల సౌజన్య ఎంపికైంది. వారంరోజుల పాటు క్రీడలు, ఆయుర్వేద ఆహారం, ఆరోగ్యం, ఆర్కిటెక్చర్, వస్త్రాలపై సహజ రంగులు ప్రింటింగ్, ఖగోళ శాస్త్రం, తదితర అంశాలపై శిక్షణనివ్వనున్నారు. సృజనకు గైడ్ టీచర్‌గా భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు పందూరు వేణుగోపాల్ వ్యవహరించారు.

వర్షాలపై అప్రమత్తం:కలెక్టర్

కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయని.. మరో మూడు రోజులు పాటు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ డాక్టర్ అంబేడ్కర్ అన్నారు అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ ఈనెల 22 నుంచి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని తెలిపారు. అది ఉత్తరాంధ్ర జిల్లాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని చెప్పారు. అధికారులు అంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదల కారణంగా ఎదురయ్యే పరిస్థితిని ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలన్నారు. అన్ని గ్రామాల్లో వచ్చే పది రోజులు నిరంతరం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. 15వ ఆర్థిక సంఘ నిధులతో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల తనిఖీ

రేగిడి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దేవుదళ కస్తూరిబా పాఠశాల వసతి గృహం, ఏవీపురం బాలుర వసతిగృహాలను రాజాం సీనియర్ సివిల్ న్యాయాధికారి సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ హస్టల్‌లో మౌలిక సౌకర్యాలు, ఆడపిల్లల విషయంలో తీసుకుంటున్న జాగ్రత్తలను ఆయన ఆరా తీశారు. స్వీపర్లు, వంట మనుషులు, కమాటి, వాచ్‌మెన్‌ల జీతభత్యాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ నివేదికను ప్రభుత్వానికి అందించనున్నట్టు ఆయన తెలిపారు. ఆయన ప్రభుత్వ న్యాయవాది ఎస్.పోలారావు, రాజాం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్ఈసీహెచ్ జయదేవ్, సెక్రటరీ ఈశ్వరరావు, కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎం.లక్ష్మి, వార్డెన్ సత్తిబాబు తదితరులు ఉన్నారు.

సంతకవిటిలో...

సంతకవిటి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సంతకవిటి మండలం వాసుదేవపట్నం సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని, కళాశాలను రాజాం సీనియర్ న్యాయాధికారి సి.హెచ్. వివేక్ ఆనంద్ శ్రీనివాస్ సందర్శించారు. శుక్రవారం సంతకవిటి వసతి గృహాలలో గదులు, వంటగది, స్టోర్‌రూంను పరిశీలించారు.

మురుగునీటి శుద్ధి కేంద్రం వద్దు

బొబ్బిలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని పారిశుధ్య కాలనీలో మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ అధికారులు ఉపక్రమించగా.. శుక్రవారం కాలనీవాసులంతా అడ్డుకున్నారు. బొబ్బిలి పట్టణంలో మూడు చోట్ల మురుగునీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరైన సంగతి తెలిసిందే. పారిశుధ్య కాలనీ వెనుక భాగాన గల ప్రభుత్వ భూమిలో ఈ కేంద్రం ఏర్పాటు పనులను యంత్రాలతో చేపట్టారు. సీఐటీయూ నాయకుడు పి.శంకరరావుతో పాటు కార్మిక నాయకులు దుర్గారావు తదితరులు అడ్డుకున్నారు. మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి, సీఐ కటకం సతీష్‌కుమార్‌లు ఘటనా స్థలానికి చేరుకుని చర్చించారు. చివరకు ఎమ్మెల్యే బేబీనాయన ముందు సమస్యను ఉంచాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జ్ఞానప్రసాద్, ఏఎస్ఐ భాస్కరరావు, ఆర్ఐ సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

● బొబ్బిలి ఆర్డీవో రామ్మోహనరావు

రామభద్రపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పేరుకుపోయిన భూసమస్యలు పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని బొబ్బిలి ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహనరావు తెలిపారు. ఇట్లామామిడిపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రీసర్వేలో ఎక్కువ లోపాలు ఉన్నట్టు గుర్తించామని, వాటిని పరిష్కరించడానికి అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమస్యలన్నీ ఆన్‌లైన్ చేసి 3 నెలల్లోగా పరిష్కరించనున్నామని తెలిపారు. ఈ సదస్సులో తహసీల్దార్ ఆకుల సులోచనారాణి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కరణం విజయభాస్కర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు

విజయనగరం రింగురోడ్డు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణదారులు అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య హెచ్చరించారు. శుక్రవారం తన కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రణాళిక విభాగం సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, ఎవరైనా అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలకు పాల్పడితే చట్టపరంగా తీసుకోవాలన్నారు. కోర్టులో చార్జిషీటు దాఖలు చేయాలన్నారు. ఆన్‌లైన్‌లో భవన ప్రణాళిక అనుమతులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. నగరంలో పోస్టర్లు, బ్యానర్లు నిషేధించామని తెలిపారు. నగర సుందరీకరణకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు వైవీ రమణమూర్తి, ఎస్.హరిబాబు, అప్పలరాజు, టీపీవో అనిత, వార్డు ప్లానింగ్ రెగ్యులేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుర్లలో డయేరియాతో మరొకరి మృతి



సూరమ్మ (ఫైల్)

గుర్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం గుర్లలో డయేరియా లక్షణాలతో మరొకరు మృతి చెందారు. గ్రామానికి చెందిన పతివాడ సూరమ్మ (75) అనే వృద్ధురాలికి రెండు రోజుల కిందట వాంతులు, విరేచనాలు అయ్యాయి. దీంతో స్థానిక పీహెచ్‌సీలో చికిత్స పొందింది. అనంతరం ఇంటికి చేరుకుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఇంటి వద్ద మృతి చెందింది. అనారోగ్యంతో పాటు బీపీ డౌన్ కావడంతో సూరమ్మ మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా, గుర్లలో ఇప్పటికే డయేరియాతో ఆరుగురు మృతి చెందారు. ఇప్పుడు ఈ సంఖ్య ఏడుకు చేరింది.

కుమార్తెకు నూడిల్స్ కొనాలని వెళ్లి..

లారీ ఢీకొని కళాసీ, యువకుడు దుర్మరణం

బొబ్బిలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణ పరిధిలోని ఫ్లైఓవర్‌పై మోపెడ్ పై వెళుతున్న వ్యక్తిని శుక్రవారం రాత్రి లారీ ఢీకొన్న ఘటనలో మెట్టవలస గ్రామానికి చెందిన కర్రి సత్యనారాయణ (35) దుర్మరణం పాలయ్యాడు. లారీ చక్రాలు అతని తలపై నుంచి వెళ్లడంతో నుజ్జునుజ్జయింది. మోపెడ్‌ను సుమారు కిలోమీటరు దూరాన ఉన్న ప్రభుత్వ ఐటీఐ దరి వరకు లారీ ఈడ్చుకుపోయింది. బైకుపై వెళుతున్న అతని కుమార్తె శిరీష, మరో ఇద్దరు కుర్రాళ్లు విశాల్, జశ్వంత్‌లు గాయపడ్డారు. ఆ ముగ్గురిని చికిత్స కోసం స్థానిక సీహెచ్‌సీలో చేర్పించారు. అక్కడ విశాల్ మృతిచెందాడు. కుమార్తె శిరీషకు నూడిల్స్ కొని ఇంటికి వెళుతుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. దీంతో బొబ్బిలి-రామభద్రపురం రహదారిలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. మెట్టవలస గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. సత్యనారాయణకు భార్య ఇందుమతి, ముగ్గురు కుమారులు గణేశ్, అప్పన్న, సత్యనారాయణ, కుమార్తె శిరీషలు ఉన్నారు. సీఐ కటకం సతీష్‌కుమార్ పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవరును అదుపులోకి తీసుకున్నారు. గ్రామసర్పంచ్ పువ్వల మాధవరావు, జనసేన నాయకులు అడబాల నాగేశ్వరరావు, గ్రామపెద్దలు సహాయక చర్యలు చేపట్టారు.

మనస్తాపంతో అతిగా మద్యం తాగి..

గుర్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గుర్ల గ్రామానికి చెందిన కలిశెట్టి రవికుమార్ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. రెండు రోజుల క్రితం రవికుమార్ తల్లి సీతమ్మ వాంతులు, విరోచనాలతో మృతిచెందారు. ఆ బాధ భరించలేక మనస్తాపంతో మద్యం ఎక్కువగా సేవించడంవల్ల మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. అతనికి ఎటువంటి వాంతులు, విరోచనాలు జరగలేదని, తల్లి మృతిచెందిందనే బాధతో ఎక్కువగా మద్యం సేవించి మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

సంతకవిటి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెయిన్ రోడ్డులో గురువారం రాత్రి ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. పోలీసులు అందించిన సమాచారం మేరకు సంతకవిటి గ్రామానికి చెందిన పొట్నూరు సంతోష్ కుమార్ ద్విచక్ర వాహనాన్ని తమ షాపు వద్ద పార్క్ చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు వాహనాన్ని చోరీ చేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై విచారణ చేపడతామని పోలీసులు తెలిపారు.

పది కేజీల గంజాయి స్వాధీనం

పాచిపెంట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాపరాయివలస సమీపంలో శుక్రవారం పోలీసులు పది కేజీల గంజా యి స్వాధీనం చేసుకున్నారు. చాపరాయివలస సమీపంలో గల రోడ్డు వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారి బ్యాగులను తనిఖీ చేయగా గంజాయి దొరికింది. ఒడిశా ప్రాంతం పాడువా నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్నట్టుగా గుర్తించి ఉత్తరప్రదేశ్‌కు చెందిన సూరజ్‌ఖాన్, మహారాష్ట్రకు చెందిన జితేంద్రరాజుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సబ్‌ఇన్‌స్పెక్టర్ వెంకటసురేష్ తెలిపారు.

విశాఖ డెయిరీ అవినీతిని బయట పెట్టాలి

జామి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా లక్షలాది మంది పాడి రైతుల కష్టాన్ని దోచుకుంటున్న విశాఖ డెయిరీ అవినీతిని బయటపెట్టి వారు దోచుకున్న మొత్తాన్ని ప్రభుత్వం వెంటనే రికవరీ చేయాలనీ ఏపీ పాడి రైతు సంఘ రాష్ట్ర కార్యదర్శి కె. అజయ్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ కోరారు. శుక్రవారం జామి మండల కేంద్రంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బుద్ధరాజు రాంబాబు ఆధ్వర్యంలో పాల రైతుల సంఘ జిల్లా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్, సూర్యనారాయణలు మట్లాడుతూ రైతుల శ్రమను దోచుకోని వేల ఎకరాల భూమిని కొని కుటుంబ సభ్యులు పంచుకుంటున్నారని ఆరోపించారు. త్వరలోనే రైతు సంఘం విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందరావు అక్రమాలను ప్రజలకు వివరించబోతోందని తెలిపారు. అనంతరం సహకార సంఘాన్ని రక్షించాలని నినాదాలు చేస్తూ బజారు సెంటరులో ఆందోళన చేశారు. రైతు సంఘ నేతలు బండారు పెదబాబు, గొర్లె రవికుమార్, చల్లా జగన్, గోపాలం, అప్పారావు, రమణ, సత్యం పాల్గొన్నారు. అనంతరం పాడిరైతుల జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లోకవరపు ఆదినారాయణ, కార్యదర్శిగా గొంప రామకృష్ణ ఎన్నికయ్యారు.

వెబ్‌సైట్‌లో అభ్యర్థుల జాబితా

కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాల్లో టీచింగ్, నాన్ టీచింగ్ (అకౌంటెంట్, వార్డెన్) పోస్టుల భర్తీకి సంబంధించి మొత్తం అభ్యర్థుల జాబితా సిద్ధమైంది. విజయనగరం.ఏపీ.జీవో.ఇన్ వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు డీఈవో ప్రేమకుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

జిల్లాకు ఏమైంది?

(5 వ పేజీ తరువాయి)

ఉంది. 11 సామాజిక ఆస్పత్రులు, 60 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు) ఉన్నాయి. వేలాది మంది వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఏటా వర్షాకాలంలో ముందస్తుగా సీజనల్ వ్యాధులను ఎదుర్కోవడంపై అధికారులు ప్రణాళిక సిద్ధం చేసేవారు. ప్రమాదకర జ్వరాలు, వ్యాధుల నియంత్రణకు ఎలా ముందుకెళ్లాలి అన్నదానిపై ఉన్నతస్థాయిలో సమీక్షించేవారు. ఆస్పత్రుల్లో అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచేవారు. కానీ, ఈ ఏడాది యంత్రాంగం పెద్దగా పట్టించుకోవడం లేదు.

నదీ జలాలు కలుషితం..

జిల్లాలోని నదీ తీర గ్రామాల్లో ఇప్పటికీ ఒక దురాచారం నడుస్తోంది. బహిరంగ మలవిసర్జనతో పాటు నదులు, వాగుల నీటిని ఇంటి అవసరాలకు వాడుతున్నారు. జిల్లాలో ఏ నది చూసినా ఏమున్నది గర్వ కారణం అన్నట్టు ఉంది పరిస్థితి. నదీ తీర గ్రామాల ప్రజలు నదుల్లో చెత్తను పారబోస్తున్నారు. చాలా గ్రామాలకు డంపింగ్ యార్డులు లేవు. గ్రామాల్లో సేకరించిన చెత్తను నదుల్లోనే వేస్తున్నారు. దీనికితోడు చాలా గ్రామాలకు శ్మశానవాటికలు లేవు. దీంతో నది గర్భంలోనే మృత దేహాలకు అంత్యక్రియలు నిర్వహిస్తుంటారు. మరోవైపు జంతువుల కళేబరాలను నదిలోనే పూడ్చుతుంటారు. ఈ కారణంగా నదుల్లో నీరు కలుషితంగా మారుతోంది. అదే నీరు భూగర్భ జలాల్లోకి ప్రవేశించి ప్రజారోగ్యానికి తీరని భంగం కలిగిస్తోంది. వాస్తవానికి ఎప్పటికప్పుడు తాగునీటి బోర్లలో నీటి పరీక్షలు జరగాలి. కానీ, ఎక్కడా చేస్తున్న దాఖలాలు లేవు. అసలు నీటి పరీక్షలు ఎవరు చేస్తారో తెలియని స్థితిలో ఉన్నారు ప్రజలు. ప్రజారోగ్యం విషయంలో వైద్య ఆరోగ్య శాఖది ఎంత బాధ్యతో.. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్ సైతం క్రియాశీలకంగా వ్యవహరించాలి. కానీ, జిల్లాలో ఆ శాఖల మధ్య సమన్వయం కొరవడుతోంది.

కానరాని పారిశుధ్య పనులు

గత ఐదు సంవత్సరాలుగా గ్రామాలు దారుణంగా దెబ్బతిన్నాయి. కనీసం పారిశుధ్య పనులు చేపట్టాడానికి వీలులేని పరిస్థితి. కొన్ని చిన్న పంచాయతీల్లో కనీస స్థాయిలో కూడా నిధులు లేవు. కేంద్రం అందించే ఆర్థిక సంఘ నిధులు కూడా వివిధ పద్దుల కింద ఇతర బకాయిలకు సర్దుబాటు చేశారు. జిల్లాలో 777 పంచాయతీల్లో కొన్ని మాత్రమే సొంతంగా నిధులు సర్దుబాటు చేసుకునేవి. మిగతావి గడ్డు పరిస్థితులను ఎదుర్కొన్నాయి. కనీసం పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించుకోలేని స్థితిలోకి కొన్ని గ్రామ పంచాయతీలు ఉన్నాయి.

అదుపులోకి వస్తుంది

గుర్లలో డయేరియా అదుపులోకి వస్తోంది. గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరం కొనసాగుతోంది. లక్షణాలు తగ్గుముఖం పట్టి ఇంటికి వెళ్లిన వారి నుంచి కుటుంబసభ్యులకు సోకుతోంది. అందుకే ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించాం. భూగర్భ జలాలు కలుషితం కావడం వల్లే వ్యాధి సోకినట్టు ప్రాథమిక నిర్ధారణ అయ్యింది. వ్యాధి అదుపులోకి వచ్చే వరకూ గ్రామంలో వైద్య శిబిరాన్ని కొనసాగిస్తాం.

- భాస్కరరావు, డీఎంహెచ్‌వో, విజయనగరం

బాబు హామీ నెరవేరుతోంది!

(5వ పేజీ తరువాయి)

రెండు వరసలుగా నిర్మించనున్నారు.

- శృంగవరపుకోట, కొత్తవలసలో నిత్యం రద్దీగా ఉండడంతో ఈ రెండింటిలోకి భారీ వాహనాలు రాకుండా ఉండేందుకు బైపాస్ రోడ్ల నిర్మాణాలను చేపడుతారు.
- బైపాస్ రోడ్లున్న కొత్తవలస మండలం చింతపాలెం గ్రామం నుంచి అప్పలన్న పాలెం సమీపం వరకు ఉన్న విశాఖ-అరకు రోడ్డును, కొత్తవలస గ్రామం మీదగా ఉన్న రోడ్డును అభివృద్ధి చేస్తారు.
- శృంగవరపుకోట మండలం వెంకటరమణ పేట కూడలి నుంచి కిల్తంపాలెం పంచాయతీ శివారు భవనీ నగర్ సమీపం వరకు నిర్మించనున్న బైపాస్ రోడ్డుతో పా టు శృంగవరపుకోట నుంచి ఉన్న విశాఖ-అరకు రోడ్డు విస్తరణ ఉంటుందని జాతీయ రహదారి అధికారులు చెబుతున్నారు.
- తూర్పుగోదావరి జిల్లా నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం, పాడేరు, అరకు, అనంతగిరి కొండల మధ్య నుంచి శృంగవరపుకోట మండలం బొడ్డవర మీదుగా వయా తాటిపూడి విజయనగరం రోడ్డు 516ఈ జాతీయ రహదారి నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. మరోపక్క పెందుర్తి నుంచి బొడ్డవర విశాఖ-అరకు రోడ్డు జాతీయ రహదారి 516బీ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నారు.

దశాబ్దాల నాటి కల

విశాఖపట్నం ఎన్‌ఏడీ కొత్తరోడ్డు నుంచి ఉన్న ఈ రోడ్డును 15 ఏళ్ల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెందుర్తి వరకు నాలుగు వరసల రోడ్డుగా వేసి వదిలేశారు. పెందుర్తి దాటిన తరువాత రెండు, మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న సరిపల్లి గ్రామం వరకు విశాఖపట్నం జిల్లా పరిధిలో మాత్రమే రోడ్డు అభివృద్ధి చేయలేదు. కొత్తవలస మండలం చింతల పాలెం గ్రామం నుంచి శృంగవరపుకోట మండలం బొడ్డవర వరకు విజయనగరం జిల్లా పరిధిలో 40.5 కిలోమీటర్ల దూరం అభివృద్ధి చేయకుండా వదిలేశారు. విశాఖపట్నం నుంచి అరకు పర్యాటక ప్రాంతానికి వేళ్లే రోడ్డు కావడంతో జిల్లాకు వాసులు ఈ రోడ్డు అభివృద్ధి కోసం ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర విభజన అనంతరం టీడీపీ అధికారం చేపట్టింది. ఈ పార్టీకి చెందిన అప్పటి, ఇప్పటి శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారి, అప్పటి, ఇప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి ఈ విషయం తీసుకుని వచ్చారు. కేంద్ర ప్రభుత్వానికి కూడా పలుమార్లు విన్నవించడంతో దీన్ని అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చింది. ఇంతలో 2019 సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఐదేళ్ల పాటు ప్రతిఏటా డిసెంబరు ఈ రోడ్డు విస్తరణను చేపడతామన్న ప్రకటనలతో కాలం వెళ్లదీశారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన నారా చంద్రబాబు నాయుడు.. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్డు విస్తరణకు పూనుకుంటామని హామీ ఇచ్చారు. ఇందుకు అనుగుణంగా అడుగులు పడుతున్నాయి.

- సార్వత్రికల సమయంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు నేరవేరుతున్నాయని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి హర్షం వ్యక్తం చేశారు. పెందుర్తి నుంచి బొడ్డవర వరకు ఉన్న విశాఖ-అరకు రోడ్డు విస్తరణకు అడుగులు పడుతున్నాయన్నారు. కాంట్రాక్టర్ ఎంపిక జరిగిన వెంటనే పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు.

డయేరియా అదుపునకు చర్యలు తీసుకున్నాం

▸▸ గుర్ల పర్యటనలో కలెక్టర్ అంబేడ్కర్ ▸▸ వివిధశాఖల అధికారులతో సమీక్ష



గుర్ల గ్రామంలో పర్యటిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

గుర్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గుర్లలో పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని, డయేరియా నియంత్రణకు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ బీఆర్.అంబేడ్కర్ తెలిపారు. గుర్ల గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరా, పైపులైన్లను పరిశీలించారు. గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. చికిత్స పొందుతున్న రోగుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. స్థానిక ఎంఈవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. డయేరియా అదుపు చేసేందుకు తీసుకున్న చర్యలు, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, వైద్య సదుపాయాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ గ్రామంలో పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని చెప్పారు. శుక్రవారం కొత్తగా 6 కేసులు మాత్రమే నమోదయ్యాయన్నారు. వారికి మెరుగైన చికిత్స అందిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు సంభవించిన మరణాల్లో కేవలం ఒక్కరు మాత్రమే డయేరియా కారణంగా మరణించారని, మిగిలిన వారు ఇతర అనారోగ్య కారణాలతో మృతి చెందారని తెలిపారు. భూగర్భ జలాలు కలుషితం కావడం వల్లే గ్రామంలో డయేరియా ప్రబలినట్లు తేలినట్లు చెప్పారు. మొత్తం గ్రామంలోని బోర్లు, తాగు నీటి వనరులను పూర్తిగా క్లోరినేషన్ చేయించామని కలెక్టర్ చెప్పారు. ఎస్ఎస్ఆర్. పేట చంపావతి నది వద్ద ఉన్న కొండపాలెం రక్షిత మంచినీటి పథకాన్ని కలెక్టర్ పరిశీలించారు. తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. కార్యక్రమంలో మెడికల్ హెల్త్ డైరెక్టర్ పద్మావతి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి భాస్కరరావు, పంచాయతీ అధికారి టి.వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్లలో కర్ఫ్యూ వాతావరణం

విజయనగరం ఆంధ్రజ్యోతి/గుర్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గుర్ల మండల కేంద్రంలో వారం రోజులుగా అతిసార తీవ్రత అధికంగా ఉండటంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. ఇంటి నుంచి బయటకు రావాలంటనే వణికిపోతున్నారు. బయట తిరి గితే ఎక్కడ వ్యాధి సోకుతుందని ఇళ్లల్లోనే ఉంటున్నారు. దీంతో ప్రధాన రహదారులు, వీధులు నిర్మానుష్యంగా మారాయి. ఎప్పుడూ రద్దీగా ఉండే మార్కెట్, ఇతర వ్యాపార సముదాయాలు మూతపడ్డాయి. దీంతో ప్రస్తుతం ఇక్కడ కర్ఫ్యూ వాతావరణం నెలకొంది. అనేక మంది గ్రామాన్ని విడిచి ఇతర ప్రాంతాల్లోని తమ బంధువుల ఇళ్లకు వెళ్లిపోతున్నారు. ఇంటి వద్దే చికిత్స పొందుతున్న డయేరియా బాధితు లు తమ ఇరుగుపొరుగు వారి సహాయం లేక ఇబ్బందులు పడుతున్నారు. డయేరియా బాధితులు, గ్రామస్థులకు కలెక్టర్ భరోసా ఇచ్చారు. గ్రామంలోని తాగునీటి వనరులను ఉపయోగించవద్దని సూచించారు. క్లోరినే షన్ చేసిన నీటిని ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నామని, వాటినే వినియోగించాలని గ్రామ స్థులను కోరారు. డయేరియా బాధితులకు చికిత్స అందించేందుకు మూడు కేంద్రాల వద్ద 24/7 వైద్యశిబిరాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

రూ.42 కోట్లతో అభివృద్ధి పనులు

▸▸ మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గంట్యాడ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రూ. 42 కోట్లతో అభివృద్ధి పనులు చేయనున్నామని రాష్ట్ర ఎంఎస్ఎంఈ సెర్ప్ ఎన్ఆర్ఐ శాఖ మంత్రి కొండపల్లి శ్రీ నివాస్ అన్నారు. రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం సాయంత్రం పెంటశ్రీరాంపురం, మదనాపురం గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా పలు అ భివృద్ధి పనులకు మంత్రి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పెంట శ్రీరాంపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 100 రోజుల పాలనలో రాష్ట్రంలోని అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ప్రతిపక్ష నాయకులు ఆరోపణలు చేస్తున్నారని వారికి అభివృద్ధితో గుణపాఠం చెప్పాలని సూచించారు. యువతకు ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ప్రస్తుతం చేస్తున్న అభివృద్ధి పనులతో గ్రామాల రూపురేఖలు మారనున్నాయని తెలిపారు. పెంటశ్రీరాంపురం గ్రామం లోని ఇళ్ల నిర్మాణం కోసం అవసరమైన స్థలం సేకరణకు కృషి, ప్రైవేటు వ్యక్తులు సహ కారం కూడా తీసుకుందామని చెప్పారు. దశల వారీగా గ్రామంలో ఉన్న సమస్యలు పరిష్కారం చేసుకుందామన్నారు. కార్యక్రమంలోని మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, మండల టీడీపీ అధ్యక్షులు కొండపల్లి భాస్కర్ నాయుడు, టీడీపీ నాయకులు గోపాలరాజు, అల్లు విజయకుమార్, జి.శ్రీనివాసరావు, రంధి చినరాము నాయుడు, పల్లి వెంకటరావు, పి.సత్యనారాయణ, రొంగళి కృష్ణ, చప్ప నారాయణప్పుడు, ఎంపీడీవో రమణమూర్తి, ప్రసాద్, జేఈ కృష్ణమూర్తి తదితరులున్నారు.

వాడీవేడిగా మండల సర్వసభ్యసమావేశం



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న నాయకులు

పూసపాటిరేగ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఎంపీపీ మహంతి కల్యాణి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడీగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, స్థానిక ఎమ్మెల్యే లోకం నాగమాధవి పాల్గొన్నారు. గ్రామీణ ఉపాధిహామీ పథకం గ్రామసభల్లో గుర్తించిన పనులపై సభ్యులు పలు ప్రశ్నలు లేవనెత్తారు. ఈవిషయమై ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో తమ నాయకులతో చర్చించి పనులు గుర్తించామని, ఇంకా అవసరమైనవి ఉంటే వాటిని మంజూరుచేసేవిధంగా చర్యలు తీసుకొంటామన్నారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ మంజూరు చేసిన పనులను ఉపాధిహామీ పథకం జీవోను అనుసరించి ఉండాలన్నారు. మండలంలో పలువిద్యుత్ సమస్యలపై సభ్యులు ధ్వజమెత్తారు. నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

గజపతినగరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల మహిళల నుంచి అవినీతికి పాల్పడిన వీ వోఏలపై సంబంధిత అధికారులు క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని టీడీపీ మండలపార్టీ అధ్యక్షుడు అట్టాడ లక్ష్మునాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సీసీ రామునాయుడుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పురిటిపెంట న్యూకాలనీకి ఆదర్శ డ్వాక్రా గ్రామీణ సంఘం వీవోఏ దుర్గావతిపై అనేక అవినీతి ఆరోపణలు వస్తున్నాయని, అనేక ఫిర్యాదులు వచ్చినప్పటికీ సంబంధిత అధికారులు వెనకేసుకురావడం శోచనీయమన్నారు. ఆమె స్థానంలో మరొకరికి అవకాశం కల్పించాలని పలు డ్వాక్రా సంఘాల సభ్యులు కోరుతున్నారని తెలిపారు. దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

అండర్ 14, 17 కబడ్డీ క్రీడాకారుల ఎంపిక

నెల్లిమర్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక తామస్‌పేట ఫుట్‌బాల్ మైదానంలో శుక్రవారం నెల్లిమర్ల నియోజకవర్గ స్థాయి అండర్ 14, అండర్- 17 కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ ఎంపిక పోటీల కార్యక్రమానికి ఎంఈవో ఈపు విజయ్‌కుమార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పోటీల్లో రాణించాలి



క్రీడాకారులను అభినందిస్తున్న ఎంఎల్ఏ నాగమాధవి

నెల్లిమర్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండవెలగాడతో పాటు ఇతర గ్రామాలకు చెందిన వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారులు భవిష్యత్తులో అంతర్జాతీయ పతకాలు సాధించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. ఇటీవల హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను ఆమె శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో రాణించడం శుభపరిణామమన్నారు. క్రీడాకారుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రవాణా చార్జీల కింద తాను 50 వేల రూపాయలు వితరణగా అందజేసిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కడగల ఆనంద్‌కుమార్, చనమల్లు వెంకటరమణ, గదల అచ్చింనాయుడు, కోచ్ చల్లా రాము, క్రీడాకారులు పాల్గొన్నారు.

పల్లెపండగలో వైసీపీ నేతలు

టీడీపీ నాయకులతో కలిసి శంకుస్థాపనలు

సాలూరు రూరల్, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బోరబందలో వైసీపీకి చెందిన సాలూరు ఎంపీపీ రాములమ్మ, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, శివరాంపురం ఎంపీటీసీ కళ్లేపల్లి త్రినాథరావు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఆముదాల పరమేశు, టీడీపీ మండల నేత మత్స శ్యాం, నడిమింటి రామకృష్ణ ఇరు పార్టీ నేతల కలయికలో పల్లెపండగ శంకుస్థాపన కార్యక్రమం ఆహ్లాదంగా జరిగింది. గ్రామంలో సీసీ రోడ్డు శంకుస్థాపనకు ఇరు పార్టీ నేతలు సమన్వయంతో కలసి రావడం, పనులు ప్రారంభించడం చక్కని వాతావరణాన్ని తలపించింది. దీనిపై సానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీవో రామకృష్ణనాయుడు తదితర అధికారులు హాజరయ్యారు.

పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి

సాలూరు రూరల్, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలను సత్వరం చేపట్టాలని స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ విజయరామరాజుకు ప్రత్యేకంగా విన్నవించినట్టు ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడుఏజీఎస్ గణపతిరావు శుక్రవారం తెలిపారు. వివిధ ఉపాధ్యాయ సమస్యలను వివరించామన్నారు. తనతో ఆప్టా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌బాబు ఉన్నారన్నారు.

అధికారులతో సమీక్ష

గుర్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అధికారులు ప్రజలు అంతా కలిసి సమిష్టిగా పని చేస్తే ప్రభుత్వానికి మంచి పేరు వ స్తుందని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ప్రచార కార్యదర్శి రామ్‌మల్లిక్‌నాయుడు అన్నారు. శుక్రవారం మండల అధికారులతో రివ్యూ ఏర్పాటు చేశారు. గుర్ల గ్రామంలో డయేరియా వ్యాపించడం వలన డయేరియా నిర్మూళన గురించి ఎంపీడీవో కార్యాలయంలో జాగ్రత్తలపై సమీక్ష నిర్వహించారు. వైద్య రెవెన్యూ పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి డయేరియా వ్యాధిని నిర్మూలించడానికి తగిన చర్యలు తీసుకోవాలని, తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. అధికారులు, కూటమి నాయకులు ఉన్నారు.

న్యూస్ బాక్స్

అసాంఘిక కార్యకలాపాలను నిరోధించాలి

నెల్లిమర్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాల నిరోధానికి మహిళా సంరక్షణ కార్యదర్శులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్ఐ బి.గణేష్ సూచించారు, స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం మండలంలోని మహిళా సంరక్షణ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు.

గురుకుల పాఠశాలలో జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్

నెల్లిమర్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్లలోని బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల గురుకుల పాఠశాలల సైన్స్‌ఫెయిర్ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ ఎగ్జిబిషన్‌కు రెండు జిల్లాలకు చెందిన 53 మంది బాలికలు, 103 మంది బాలురు హాజరై 130 ప్రోజెక్టులను ప్రదర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఉషారాణి, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయ కర్త టిఎం ఫ్లోరెన్స్, డిప్యూటీ డీఈవో రమణ, ఎంఈవోలు హాజరై ప్రోజెక్టులను పరిశీలించారు.

నేడు డయల్ యువర్ డీఎం

సాలూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో స్థానిక ఆర్టీసీ డిపోలో శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నామని అసిస్టెంట్ మేనేజర్ కరుణశ్రీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తున్నామని, ఆర్టీసీ డీఎం ఏ.బాస్కరరెడ్డికి నేరుగా 9959225622 నెంబర్లో ఫోన్ చేసి సమస్యలు, సలహాలు చెప్పవచ్చునని తెలిపారు.

ఏకలవ్య పాఠశాలల్లో స్థానికులకు అవకాశమివ్వాలి

సాలూరు రూరల్, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో స్థానిక భాష తెలిసిన ఉపాధ్యాయులను నియమిస్తే విద్యార్థులకు అభ్యాసన సులభతరమవుతుందని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు విన్నవించినట్టు రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను శుక్రవారం కలిశానని, ఏడాదిగా రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో పర్యటించి సేకరించిన గిరిజన సమస్యలపై సంక్షిప్త నివేదిక ఇచ్చానన్నారు. స్థానిక ఉపాధ్యాయ అభ్యర్థులకు అవకాశం కల్పించాల్సిన అవసరం వివరించానని, జీవో 3 రద్దు వల్ల గిరిజన యువత ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లానన్నారు.